క్లుప్తంగా

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

తుని: రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద యూనిట్ల వరకు ఉచితంగా ఇచ్చే రాయితీని ప్రభుత్వం రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎస్టీ, ఎస్సీల సబ్ ప్లాన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి ప్రారంభం



బ్యాంక్ బ్రాంచిని ప్రారంభించిన జీఎం శ్రీవాత్సవ

జగ్గంపేట: నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా జగ్గంపేట బ్రాంచిని గురువారం బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎఫ్‌జీఎంఓ మనోజ్ శ్రీవాత్సవ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం జోన్‌లో జగ్గంపేట బ్రాంచి 80వ బ్రాంచి అని తెలిపారు. తమ బ్యాంక్‌లో అందుబాటులో ఉన్న సేవలను కస్టమర్లు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ విశాఖపట్నం జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్, జగ్గంపేట ప్రముఖులు కొత్త భైరవకృష్ణ, డాక్టర్.బాలగంగాధర్, డాక్టర్ ప్రసాద్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు త్వరితగతిన వసూలు చేయాలి



జగపతినగరంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాలామణి

కిర్లంపూడి: దీర్ఘకాలంగా బకాయిలున్న పన్నులు త్వరితగతిన వసూలు చేయాలని డీఎల్‌పీఓ బాలామణి అధికారులను ఆదేశించారు. జగపతినగరం, ముక్కొల్లు గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ నిత్యం గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి, సంపద కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన ఎరువును తయారు చేసి రైతులకు అందించాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు ఎన్‌టీఆర్ రమేష్ బాబు, కె.సరళాదేవి ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చినబాబు, నూకాలమ్మ

కోటనందూరు: అల్లిపూడి అంబేడ్కర్ కాలనీలో ఒమ్మల సింహాచలం ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైంది. ఆ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సర్పంచ్ తరిపే నూకాలమ్మ గురువారం పరామర్శించారు. చినబాబు సమకూర్చిన రూ.20 వేల ఆర్థికసాయం, పార్టీ వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ వెలగా వెంకటకృష్ణాజీ సమకూర్చిన నిత్యావసరాలను బాధిత కుటుంబానికి సర్పంచ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తరిపే సత్యనారాయణ, కాపారపు సత్యనారాయణ, యాదగిరి రవిశేఖర్, పండుగ వెంకబ్బాయి, దుత్తర్తి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ గురువారంతో ముగిసిందని కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. డీకోడింగ్ డేటా అండ్ లాంగ్వేజ్–హ్యాండ్ ఆన్ డేటా సైన్స్ అండ్ నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ అనే అంశంపై అవగాహన కల్పించారు.

బీమా చెక్కుల పంపిణీ

ప్రత్తిపాడు: పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన లబ్ధిదారులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెక్కులు పంపిణీ చేశారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో ఒమ్మంగి, టి.రాయవరం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.2 లక్షల వంతున చెక్కులను గురువారం ఇక్కడ అందజేశారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి అనిల్ అంబేడ్కర్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కలపాల రాజ్‌కుమార్, మేనేజర్ నీలి బాలాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే సత్యప్రభ శంకుస్థాపనలు చేశారు. రూ.4 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, సీసీ రోడ్డు, వీధి దీపాలు, యర్రవరంలో రూ.10 లక్షలతో ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మందకొడిగా వసూళ్లు

- ఆస్తి పన్నులపై మల్లగుల్లాలు
- డిమాండ్ రూ.6.67 కోట్లు
- వసూళ్లు రూ.2.90 కోట్లు
- సర్వేలతో సిబ్బంది బిజీ
- మూడు వారాల్లో ముగుస్తున్న ఆర్థిక సంవత్సరం



తుని నియోజకవర్గంలో అత్యల్పంగా ఆస్తి పన్నులు వసూలైన రాజుపేట గ్రామం

తుని రూరల్: పల్లెలు ప్రగతి సాధించాలంటే ఆర్థిక వనరులు కీలకం. సొమ్ము లేనిదే గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు జరగవు. నిధులు సమకూర్చుకోవడంలో ఏకైక మార్గం గృహ, గృహేతర ఆస్తి పన్నులదే సింహ భాగం. పన్ను వసూళ్లు మాత్రం తుని నియోజకవర్గంలో మందకొడిగా సాగుతోంది. మరో మూడు వారాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా, ఆశించిన స్థాయిలో ఆస్తి పన్నుల వసూళ్లు కాలేదు. ప్రభుత్వం అప్పగిస్తున్న వివిధ సర్వేలతో బిజీగా ఉంటున్న సచివాలయాల సిబ్బంది పన్నుల వసూళ్లపై దృష్టి సారించడం లేదు. ఇదే పరిస్థితులు కొనసాగితే మార్చి 31 నాటికి లక్ష్యానికి అనుగుణంగా వసూళ్లు సాధ్యం కావు. నియోజకవర్గంలో గృహ, గృహేతర పాత బకాయిలు, కొత్త డిమాండ్ రూ.6,67,13,713గా ఉంది. ఇందులో 2024–25 డిమాండ్ రూ.4,48,62,893, పాత బకాయిలు రూ.2,18,50,820 ఉన్నాయి. 11 నెలల్లో మొత్తం రూ.2,90,52,172 (43.55 శాతం) మాత్రమే వసూలైంది. వసూలైన మొత్తం సాల్వేన్సీలు, ఇతర అవసరాల కోసం గ్రామీణులు స్వచ్ఛందంగా చెల్లించినట్టు తెలుస్తుంది. నియోజకవర్గంలో అత్యధికంగా తొండంగి మండలం అద్దరిపేటలో రూ.5,49,418కి రూ.3,79,724 (69.11శాతం) వసూలైంది. అత్యల్పంగా తుని మండలం రాజుపేటలో రూ.51,41,635కి రూ.1,87 లక్షలు (3.64శాతం) వసూలైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ గ్రామంలో పాత బకాయిలు రూ.41.85 లక్షలున్నాయి. ఓ విద్యా సంస్థ కోర్టును ఆశ్రయించడంతో పాత బకాయిలు పేరుకుపోయినట్టు తెలుస్తుంది.

జీతభత్యాలకు అవస్థలు

ఆస్తి పన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరకపోవడంతో అభివృద్ధి పనులకు, పారిశుధ్య, ఇతర కార్మికుల జీతభత్యాలకు అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు ప్రభుత్వం జీతభత్యాలు చెల్లిస్తోంది. కార్మికులకు పంచాయతీల నుంచి చెల్లించాల్సి ఉంది. పన్నులు వసూలు కాకపోవడంతో కొన్ని పంచాయతీల్లో ఐదారు నెలలుగా జీతాలు అందడం లేదు. ఆస్తి పన్నులు వసూలైతేనే వీరికి జీతభత్యాలు దక్కేది. ఆస్తి పన్నులు వసూళ్లకు ముందు నుంచి సరైన ప్రణాళిక అమలు, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడంతో ఏటేటా బకాయిలు పేరుకుపోతున్నాయి.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

గృహ, గృహేతర పన్నులు 50 శాతానికి పైగా వసూలు చేశాం. సచివాలయ సిబ్బందిని బృందాలుగా నియమించి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తాం. వందశాతం పన్నులు వసూలు చేస్తాం. బకాయిదారులు ఎప్పటికైనా చెల్లించాల్సిందే. అభివృద్ధి పనులు జరగాలంటే పన్నులు చెల్లించి, సహకరించే చైతన్యం గ్రామీణుల్లో రావాలి.

– జి.మరిడయ్య, ఈఓపీఆర్డీ, తుని

నియోజకవర్గంలో ఆస్తి పన్ను వసూళ్లు, బకాయిలు

మండలం	సచివాలయాలు	మొత్తం డిమాండ్(రూ.ల్లో)	మొత్తం వసూళ్లు(రూ.ల్లో)	బకాయిలు(రూ.ల్లో)
తుని	23	2,29,51,159	93,45,291	1,36,05,868
తొండంగి	22	2,30,57,826	1,16,13,108	1,14,44,718
కోటనందూరు	17	1,10,20,267	51,68,349	58,51,918
మొత్తం	62	5,70,29,252	2,61,26,748	3,09,02,504

నియోజకవర్గంలో గృహేతర ఆస్తి పన్ను వసూళ్లు, బకాయిలు

మండలం	మొత్తం డిమాండ్(రూ.ల్లో)	మొత్తం వసూళ్లు(రూ.ల్లో)	బకాయిలు(రూ.ల్లో)
తుని	19,77,890	9,99,620	9,78,270
తొండంగి	55,15,554	12,47,867	42,67,687
కోటనందూరు	21,91,017	6,77,940	15,13,077
మొత్తం	96,84,461	29,25,427	67,59,034

నూరు శాతం ఉత్తీర్ణతకు సమష్టి కృషి

– డీఈఓ రమేష్



వాకదారిపేట కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

తొండంగి: ప్రభుత్వ, జెడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీలలో చదువుతున్న టెన్త్, ఇంటర్ విద్యార్థుల నూరు శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమష్టిగా కృషి చేయాలని డీఈఓ పి.రమేష్ అన్నారు. గురువారం తొండంగి మండలంలోని వాకదారిపేటలో కేజీబీవీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాల మెనూ, వంటశాల, తాగు నీటి ఆర్వోప్లాంటు, నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపించరాదని అధికారులకు సూచించారు. అనంతరం టెన్త్, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. పలు సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులను ప్రశ్నించారు. అదేవిధంగా విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు, ఇతర రికార్డులను పరిశీలించారు. నూరు శాతం ఉత్తీర్ణతకు ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. అదే విధంగా అద్దరిపేట జెడ్పీ హైస్కూలు, ప్రైమరీ స్కూళ్లను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ప్రత్యామ్నాయ భూములు పరిశీలించిన కలెక్టర్



చేపూరు వద్ద పోలవరం కాలువ భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ తవ్వకంలో వెలువడే మట్టిని డంపింగ్ చేసేందుకు సేకరించిన కుమ్మరిలోవ జిరాయితీ భూములకు ప్రత్యామ్నాయంగా ఇవ్వనున్న భూములను, కాలనీ నిర్వాసితుల ఇళ్లస్థలాల భూమిని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. గురువారం ఆయన తుని మండలం హంసవరం, చేపూరు, వి.కొత్తూరు సమీప పోలవరం కాలువ భూములను పరిశీలించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువకు పూర్వం సేకరించి కాలువ తవ్వకం పూర్తవడంతో, కాలువను ఆనుకుని ఉన్న భూములను ప్రత్యామ్నాయంగా ఇవ్వనున్నారు. కుమ్మరిలోవ రైతులకు చెందిన జిరాయితీ భూములకు నోటిఫికేషన్ జారీ చేయకుండా సేకరించడంపై రైతులు అభ్యంతరం తెలుపుతూ కోర్టును ఆశ్రయించారు. గత నెలలో కాలువ తవ్వకం పనులను బాధిత రైతులు అడ్డుకున్నారు. దీంతో ఇరిగేషన్, భూసేకరణ అధికారులు ఈ సమస్యను కలెక్టర్‌కు నివేదించారు. రైతులతో చర్చించిన తర్వాత భూములకు భూమి ఇవ్వడానికి సూచనప్రాయంగా అంగీకరించి, అందుకు అవసరమైన భూములను ఇరిగేషన్ అధికారులు సూచించారు. ఇప్పటికే కాలువకు సేకరించిన వి.కొత్తూరు, చేపూరు, హంసవరం సమీప భూములను క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. రైతులకు, అధికారుల మధ్య అంగీకారం కుదిరితే ప్రత్యామ్నాయంగా తాళ్లూరు భూ బాధిత రైతులకు ఆ భూములు ఇవ్వనున్నారు. కలెక్టర్ వెంట పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి, పోలవరం ఇరిగేషన్ ఈఈ గోవిందు, తహసీల్దార్ ప్రసాద్, సర్వేయర్ దేవుడు తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

– వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ గిరిబాబు



సిరిపురంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని సిరిపురం, ప్రత్తిపాడు మండలం ఏలూరులో గురువారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రజా పాలన రావాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. అనంతరం తన తండ్రి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూరు శాతం పని దినాలు కల్పించాలి



ఫీల్డ్ అసిస్టెంట్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

గండేపల్లి: ఉపాధి కూలీలకు నూరు శాతం పనిదినాలు కల్పించాలని ఎంపీడీఓ నాతి బుజ్జి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలానికి ఇచ్చిన 5.38 లక్షల పనిదినాల టార్గెట్‌లో 84 శాతం పూర్తి అయిందని, మిగిలినవి 20 రోజుల్లో పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. వంద రోజుల పనిదినాలు 694 కుటుంబాలకు కల్పించగా, మరో వెయ్యి కుటుంబాలకు పనులు కల్పించాలని సూచించారు. పనుల కల్పనలో మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ, మరింత పురోగతి సాధించాలన్నారు. ఫారం పాండ్స్, సోక్ పిట్స్ ఎస్టిమేట్స్ వేయాలని సాంకేతిక సహాయకులకు ఆదేశించారు. అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన సింగరంపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ బి.ఉమాదేవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఆర్ గంగాభవాని, ఈసీ రమేష్, టీఏలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే శిశువుకు ఆరోగ్యం

కిర్లంపూడి: గర్భవతులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారని జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. కొండయ్యపేట, చిల్లంగి, కిర్లంపూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లను ఆమె గురువారం సందర్శించారు. ఆర్గానిక్ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలను గర్భిణులకు, బాలింతలకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ, శిశువుకు ఆరేళ్లు వచ్చే వరకు పోషక విలువల ఆహారంతో పాటు, ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. పిల్లలను సెల్‌ఫోన్లు, సినిమాలకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం కిర్లంపూడిలోని అంగన్‌వాడీ సెంటర్–4లో ముగ్గురు గర్భిణులకు శీమంతాలు, ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకను నిర్వహించారు.

ఘనంగా మహిళా దినోత్సవం



బహుమతులు, జ్ఞాపికలతో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు

రౌతులపూడి: శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక వెలుగు కార్యాలయంలో రౌతులపూడి, శంఖవరం మండలాల అంగన్‌వాడీ టీచర్లకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ టీచర్లుగా జర్తా నాగమణి, పి.చిట్టెమ్మ, ఉత్తమ సహాయకులుగా ఇనకోటి పుష్పలత, శేషను జ్ఞాపికలతో సత్కరించారు.

పీ-4 సర్వేపై అవగాహన సదస్సు

కోటనందూరు: ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజలు, పార్టనర్‌షిప్(పీ–4)పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటనారాయణ మాట్లాడుతూ, పీ–4 సర్వేను సమర్థంగా నిర్వహించి సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు. సర్వేపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ నెల 8 నుంచి 18 వరకూ సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ఈఓపీఆర్డీ ఎస్ జయరాం పాల్గొన్నారు.

శంఖవరం: పీ–4 సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.శర్మ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. సర్వే ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో పేద ప్రజలను గుర్తిస్తారన్నారు. 20 శాతం ఉన్న పేదలను 10 శాతం ధనికులతో అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాద్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు కావాలి

- జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

ప్రత్తిపాడు: రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం ప్రత్తిపాడులోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రైతులకు యూనిక్ ఐడీ నంబర్ ద్వారానే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు ప్రత్యక్షంగా కానీ, ఓటీపీ ద్వారా కూడా నమోదు చేయించుకోవచ్చన్నారు. ఆయన వెంట జగ్గంపేట ఏడీఏ ఇంటి వీరగంగాధర్, రైతు సేవా కేంద్రాల సహాయకులు ఉన్నారు.

జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌లపై వివరించారు. కెమిస్ట్, డ్రగిస్ట్ అసోసియేషన్ ట్రెజరర్ కేదార్‌శెట్టి సురేష్ ఫార్మసీ రంగ పరిణామాలను విద్యార్థులకు విశ్లేషించారు.

ఉత్సవాలకు రాట ముహూర్తం

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ గురువారం రాట ముహూర్తాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకల నిర్వహణకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వారం రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ

తొండంగి: ఉపాధి హామీ పనులకు సంబంధించి గురువారం నిర్వహించిన మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక మొక్కుబడిగా సాగింది. డ్వామా పీడీ ఏ.వెంకటలక్ష్మి, మండల స్థాయి ఆడిట్ అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. 2023–2024కు రూ.8 కోట్ల పనులు నిర్వహించగా, రూ.1.21 లక్షల ఆడిట్ సక్రమంగా లేకపోవడంతో, ఆ సొమ్మును రికవరీ చేయాలని ఆదేశించినట్టు ఏపీఓ రామచంద్రరావు తెలిపారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

గోకవరం: శివరామపట్నం గ్రామంలో నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూమిని నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు తహసీల్దార్ సాయిప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. రెండు దశాబ్దాలుగా 36 ఎకరాల భూమిని నిరుపేదలు సాగు చేసుకుంటున్నారని, అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

యూనివర్సిటీ వార్షిక వేడుకలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా శుక్ర, శనివారాల్లో స్థానిక సరస్వతీ దేవి ఆలయం, షిరిడీ సాయి మందిరం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక హారతులు తదితర పూజాది కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

రైతులు, గ్రామస్తుల సౌకర్యార్థం రహదారి

- పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి హామీ



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న తాళ్లూరు గ్రామస్తులు, రైతులు

తుని రూరల్: తాళ్లూరు గ్రామస్తులు, రైతుల సౌకర్యార్థం పొలాలకు, కాలనీకి, గ్రామదేవత ఆలయానికి రాకపోకలకు అనువుగా రహదారిని ఏర్పాటు చేస్తామని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణ హామీ ఇచ్చారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ తవ్వకంతో పొలాలకు, కాలనీకి, గ్రామదేవత ఆలయాలకు వెళ్లే రహదారి మార్గం ధ్వంసమవుతుందని ఆందోళన చేస్తూ కాంట్రాక్టర్ చేపట్టిన పనులు అడ్డుకున్న విషయం తెలిసిందే. సమస్యను పరిష్కరించేందుకు గురువారం తుని తహసీల్దార్ కార్యాలయంలో తాళ్లూరు గ్రామస్తులు, రైతులతో ఆర్డీఓ సమావేశమయ్యారు. బ్రిడ్జి నిర్మించాలని, అప్పటి వరకు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే నిర్మించిన స్లూయిజ్‌ను రహదారి మార్గాన్ని అభివృద్ధి చేయాలని, కిలో మీటరు వరకు సీసీ రోడ్డు లేదా బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు, రైతులు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. అందుకు అంగీకరించిన ఆర్డీఓ.. బ్రిడ్జి నిర్మించే అంశం జిల్లా స్థాయిలో సాధ్యం కాదని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నిర్ణయం ఏదైనా పోలవరం ఎడమ ప్రధాన కాలువ తవ్వకం పనులు అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పోలవరం కాలువ పనులు త్వరితంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. సమస్య పరిష్కరించే దిశగా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. బ్రిడ్జి నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇవ్వలేదు. అంతకు ముందు చేపూరు వద్ద పోలవరం కాలువను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ షణ్మోహన్‌ను కలసి గ్రామస్తులు, రైతులు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ ప్రసాద్, పోలవరం ఇరిగేషన్ ఈఈ గోవిందు, డీఈ మురళీ, జేఈలు, తాళ్లూరు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో రైతుల పనులు ప్రతిపాదించాలి



కె.గోపాలపురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

గండేపల్లి: రైతులందరికీ అధిక మొత్తంలో ఫారం పాండ్లు, హార్టికల్చర్, ట్రెంచ్ వర్కులు ప్రతిపాదించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు అడపా వెంకటలక్ష్మి ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని కె.గోపాలపురంలో జరుగుతున్న ఉపాధి పనులలో భాగంగా గ్రామానికి చెందిన రైతు పందిరి మంగ వరి పొలంలో చేపడుతున్న ఫారం పాండు పనిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుని పొలం గట్టుపై మొక్కలు, కూర మొక్కలు పెంచేవిధంగా చూడాలన్నారు. అలాగే రైతులందరికీ పనులు ప్రతిపాదించాలన్నారు. ఈమె వెంట ఏపీఓ ఆర్ గంగాభవాని, ఈసీ పి.రమేష్, సాంకేతిక, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

సామాజిక తనిఖీల్లో రూ.87 వేల రికవరీ

- టీఏ, ఎఫ్ఏలకు జరిమానాలు



ప్రజా వేదికలో నివేదిక వెల్లడిస్తున్న డీఆర్పీ, జేఈలు

తుని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల్లో రూ.87,358 రికవరీ చేయగా, రూ.18 వేల జరిమానాలు విధించినట్టు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ సింహాద్రి అధ్యక్షతన మండల స్థాయి సామాజిక తనిఖీ నివేదికలను డీఆర్పీలు గ్రామాల వారీగా వెల్లడించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన రూ.14.96 కోట్ల విలువైన 1,442 పనులకు గత నెల 20 నుంచి ఈ నెల నాలుగు వరకు సోషల్ ఆడిట్ జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో గ్రామ సభలు నిర్వహించలేదని, ఇప్పుడు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు పీడీ తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో కొలతలు సక్రమంగా నమోదు చేయకపోవడం, ఫీల్డ్ అసిస్టెంట్ల అదనపు చెల్లింపులు, రికార్డుల నిర్వహణ, జాబ్ కార్డుల జారీ లోపభూయిష్టంగా ఉండడంతో రూ.18 వేల జరిమానాలు, రూ.87,358 రికవరీ చేసినట్టు ఆమె వివరించారు. ఏపీడీ జగదాంబ, ఎంపీడీఓ కె.సాయినవీన్, ఏపీఓ పి.నారాయణరావు, జేఈ ఆంజనేయులు, డీఆర్పీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మామిడి తోటల్లో తెగుళ్లపై దృష్టి సారించాలి

- జిల్లా ఉద్యాన శాఖాధికారి మల్లికార్జునరావు

తొండంగి: వేసవి నేపథ్యంలో మామిడి తోటలకు వచ్చే తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎన్.మల్లికార్జునరావు అన్నారు. గురువారం మండలంలోని బెండపూడిలో మామిడితోటలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి చెట్లకు సోకే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవి ప్రారంభం కావడంతో తేనెమంచు, తామర, పిండినల్లి, పక్షికన్ను తెగులు వంటివి ఆశించే అవకాశం ఉందన్నారు. తేనెమంచు పురుగు లేత కొమ్మలు, చిగుళ్ల పూత నుంచి రసాన్ని పీల్చి ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. దీనివల్ల పూత మాడిపోవడంతో పాటు, పిందె రాలిపోతుందన్నారు. దీని నివారణకు తోటలో నీళ్లు నిల్వ లేకుండా చేయడంతో పాటు, క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తామర పురుగు, పిండినల్లి, పక్షికన్ను తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తుని ఉద్యాన శాఖాధికారి జి.విజయలక్ష్మి, సచివాలయ అసిస్టెంట్లు ఉన్నారు.

జాబ్‌మేళాలో 35 మంది ఎంపిక

గోకవరం: వివిధ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి స్థానిక కేవీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా జరిగింది. కరస్పాండెంట్ డాక్టర్ పీవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్‌కాన్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ, వైఎస్ఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్, జీజే సొల్యూషన్స్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 200 మంది అభ్యర్థులు హాజరు కాగా, ఆయా కంపెనీల ప్రతినిధులు 35 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగం పొందిన వారికి ఆయా కంపెనీలలో ఆకర్షణీయమైన జీతంతో పాటు, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారని కరస్పాండెంట్ ప్రసాద్ తెలిపారు.

విస్తృతంగా ఇంకుడు గుంతల ఏర్పాటు

గోకవరం: భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతల పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు అన్నారు. కొత్తపల్లి పంచాయతీలో పొలంలో ఇంకుడు గుంతల పనులను గురువారం ఆయన పరిశీలించారు. మండలంలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 260 ఇంకుడు గుంతల ఏర్పాటు లక్ష్యమన్నారు. ఎంపీడీఓ గోవిందు, ఏపీఓ పిశిష అప్పలరాజు పాల్గొన్నారు.